ప్రజాస్వామ్యం దిశగా.. బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ చరిత్ర మొత్తం రక్తసిక్తం. ప్రజలు ప్రజాస్వామ్యం కోరుతున్నా.. పాలకులు ఆ దిశగా ప్రయత్నిస్తున్నా.. ఎన్నో ఆటంకాలు, అవాంతరాలు ఆ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచాయి. భారత్ సాయంతో 1971లో తూర్పుపాకిస్థాన్.. బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించింది. గత 38 ఏళ్లలో 16 సంవత్సరాలు సైనిక పాలనలోనే మగ్గింది. రాజకీయ అస్థిరత దేశాభివృద్ధి కుంటుపడేలా చేసింది. అయితే అక్కడి ప్రజల ప్రగాఢ ప్రజాస్వామ్య కాంక్ష ఒక్కటే ఆ దేశానికి శ్రీరామరక్షగా నిలిచింది. గతేడాది షేక్ హసీనా నేతృత్వంలో అవామీ లీగ్ పార్టీ బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడిప్పుడే పాత గాయాల నుంచి కోలుకుని అభివృద్ధి దిశగా పయనిస్తున్న బంగ్లాదేశ్‌పై విశ్లేషణ..

స్వాతంత్ర్యం లభించినప్పటి నుంచి నేటి వరకు బంగ్లాదేశ్ సమస్యలతో సతమతమవుతోంది. సైనిక తిరుగుబాటుల కారణంగా అక్కడ రాజకీయ సుస్థిరత ఎండమావిగా మారింది. దేశ ఆవిర్భావం మొదలు ఇప్పటివరకు 19 సార్లు సైనిక తిరుగుబాట్లు జరిగాయి. ఇద్దరు దేశాధ్యక్షులు హత్యలకు గురయ్యారు. ఈ నేపథ్యం నుంచి బంగ్లాదేశ్ ఇపుడిప్పుడే బయటపడుతోంది. 2008, డిసెంబర్ 29న జరిగిన 9వ పార్లమెంటరీ ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలో అవామీలీగ్ పార్టీ అఖండ విజయం సాధించింది. ప్రజా స్వామ్యం పట్ల అక్కడి ప్రజల ఆకాంక్షకు ఈ గెలుపు ప్రతీకగా నిలుస్తోంది.

అవామీలీగ్ అద్భుత విజయం:

బంగ్లా బంధు షేక్ ముజిబర్ రెహ్మాన్ కుమార్తె షేక్ హ సీనా నాయకత్వంలో అవామీ లీగ్ పార్టీ 299 స్థానాలకుగాను 230 స్థానాల్లో ఘన విజయాన్ని సాధించింది. ఈ విజయం 1970లో ముజిబర్ రెహ్మాన్ విజయాన్ని గుర్తుకు తెస్తోంది. అప్పటి ఎన్నికలే తూర్పుపాకిస్థాన్.. బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించడానికి కారణమయ్యాయి. ఇక తాజా ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు హెచ్.ఎం.ఎర్షాద్ నాయకత్వంలోని జాతీయ పార్టీ 27 సీట్లు, ఇతర మిత్ర పక్షాలు 5 సీట్లు కలుపుకుని అవామీలీగ్ గ్రాండ్ అలియెన్స్‌కు మొత్తం 262 సీట్లు లభించాయి. 80 శాతం ఓటర్లు పాల్గొన్న ఈ ఎన్నికల్లో మాజీ ప్రధాని బేగం ఖలీదా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) కేవలం 27 సీట్లను మాత్రమే గెలుచుకుంది. ఇక జమాతీ- ఇ-ఇస్లామీ రెండు సీట్లు, బంగ్లాదేశ్ జాతీయ పార్టీ ఒక సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. స్వేచ్ఛగా ప్రజాస్వామ్య బద్ధంగా జరిగిన ఈ ఎన్నికల్లో అవామీలీగ్ పార్టీ సాధించిన ఘన విజయం దక్షిణాసియాలోనే గత రెండు దశాబ్దాల్లో ఏ రాజకీయ పార్టీ లేదా ఏ సంకీర్ణకూటమి సాధించలేకపోవడం విశేషం. ప్రజలు ఇచ్చిన తీర్పుతో తాము హామీ ఇచ్చిన విధంగా సంస్కరణల అమలుతోపాటు రాజ్యాంగాన్ని సవరించే అధికారం అవామీలీగ్‌కు లభించింది. బంగ్లా ప్రజలు మతతత్వం, తీవ్రవాదం, అరాచకత్వం, నియంతృత్వాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించినట్లు హసీనా విజయం రుజువు చేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. బీఎన్‌పీ

అవినీతి, అణిచివేత విధానాలను, ఆ పార్టీ మిత్రపక్షమైన జమాతీ-ఇ-ఇస్లామీ మతతత్వాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు స్పష్టమైన తీర్పుఇచ్చారు. ప్రజలు శాంతి, సుస్థిరత, ప్రజాస్వామ్యాన్ని ఎంత బలంగా కోరుకుంటున్నారో పెరిగిన ఓటింగ్ సరళిని బట్టి విశదమవుతోంది. 2009, జనవరి 6న షేక్ హసీనా బంగ్లాదేశ్ 12వ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె ఈ పదవి చేపట్టడం ఇది రెండోసారి. (మొదటి సారి 1996నుంచి 2001 వరకు ప్రధానిగా పనిచేశారు). ఫిబ్రవరిలో అవామీలీగ్ ప్రముఖ నాయకుడు జిల్లర్ రెహ్మాన్‌ను బంగ్లాదేశ్ 19వ అ ధ్యక్షుడిగా ఎన్నికల సంఘం నియమించింది. రెహ్మాన్ ఎ న్నిక ఏకగ్రీవంగా జరిగింది.

హసీనా ప్రాధాన్యాలు:

21వ శతాబ్దపు సవాళ్లను యువతరం దీటుగా ఎదుర్కొనేందుకు నాణ్యమైన విద్యతో పాటు, ఐటీ విప్లవ ఫలితాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడం తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధమ్యం అని హసీనా ఎన్నికల ప్రచారంలో హామీనిచ్చారు. అలాగే పేదరికాన్ని నిర్మూలించి అందరికీ సమానా వకాశాలు కల్పించడం తోపాటు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకొస్తామని ఆమె వాగ్ధానం చేశారు. పాలనలో ప్రతిపక్షానికి కూడా భాగస్వామ్యం కల్పించడంలో భాగంగా.. డిప్యూటీ స్పీకర్ పదవి, నిష్పత్తి ప్రాతిపదికన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యక్ష పదవిని కూడా ప్రతిపక్షాలకు కేటాయిస్తా మన్నారు. దక్షిణాసియాలో శాంతి, సుస్థిరత కోసం తీవ్రవాదం, ఉగ్రవాదాలను అదుపు చేసేందుకు వీలుగా ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే విషయంలో పొరుగు దేశాల సాయం కూడా తీసుకోవాలని కొత్త ప్రభుత్వం భావిస్తోంది.

భారత్ స్పందన:

బంగ్లాదేశ్‌లో పార్లమెంటు ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా జరిగి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వం ఏర్పడటం పట్ల భారత్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రధాని మన్మోహన్ కొత్త ప్రధాని హసీనాకు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలు అక్కడి ప్రజల ప్రజాస్వామ్య, ప్రగతిశీల ఆ కాంక్షలను తేటతెల్లం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. హసీనా ఎన్నికతో బంగ్లాదేశ్‌తో తమ సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అవామీలీగ్ విజయం బంగ్లాదేశ్‌లో సామాజిక సుస్థిరతను కల్పించి ఆర్థిక ప్రగతిని వేగవంతం చేస్తుందని భారత్ భావిస్తోంది. మతాల మధ్య సామరస్యం పెంపొందించడం, విదేశాలతో ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారాన్ని కొనసాగించడం అవామీలీగ్ విధానాలు. మతఛాందసవాదులు తమ కార్యకలాపాలు సాగించడానికి బంగ్లాదేశ్ అనువుగా ఉంటోంది. ముఖ్యంగా భారతదేశాన్ని వ్యతిరేకించే పాక్ ఇస్లామిస్ట్ గ్రూపులైన హర్కత్-ఉల్- జిహాద్ - ఈ-ఇస్లామీ వంటి సంస్థలే కాక యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం (అల్ఫా) వంటి అనేక ఇతర సంస్థలకు బంగ్లాదేశ్ సురక్షిత స్థావరంగా మారడానికి గత బీఎన్‌పీ ప్రభుత్వ వైఖరే కారణం. ప్రస్తుత

అవామీలీగ్ ప్రభుత్వం వీరి పట్ల కఠినంగా వ్యవహరించి అంతర్గతంగానూ, దేశం వెలుపల కూడా శాంతి భద్రతలు నెలకొల్పడానికి కృషి చేస్తుందని తద్వారా భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలు పటిష్టమవుతాయని విశ్లేషకుల భావన.

మొదట్నుంచీ అవామీలీగ్ భారత్ పట్ల అనుకూల వైఖరితో ఉంది. 1996 నుంచి 2001 వరకు హసీనా బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఇరు దేశాల మధ్య చక్కటి ద్వైపాక్షిక సంబంధాలు ఉండేవి. ప్రస్తుత విజయంతో ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలు తిరిగి గాడిన పడగలవని భారత్ భావిస్తోంది. బంగ్లాదేశ్ ఉత్పత్తులకు భారత్‌లో విస్తృతమైన మార్కెట్ కల్పించడం ద్వారా వాణి జ్య సహకారాన్ని అందచేయాలని విశ్లేషకులు అంటున్నారు. హసీనా ప్రభుత్వ ఏర్పాటును అవకాశంగా తీసుకొని సరిహద్దు వివాదంతోపాటు అన్ని సమస్యలను భారత్ పరి ష్కరించుకోవాలని కూడా వారు సూచిస్తున్నారు.

బంగ్లాదేశ్ రైఫిల్స్ (బీడీఆర్) తిరుగుబాటు:

హసీనా పగ్గాలు చేపట్టి రెండు నెలలుకూడా గడవకముందే బంగ్లాదేశ్ రైఫిల్స్ సిపాయిలు తిరుగుబాటు అందర్నీ కలవరపరచింది. ఈ తిరుగుబాటును హసీనా ప్రభుత్వం ఎంతో చాకచక్యంగా అణచివేసింది. 2009, జనవరి 25న ఢాకా దగ్గరలోని పీల్‌ఖానా ప్రాంతంలో సాయుధులైన బీడీఆర్ జవాన్లు తమ హెడ్ క్వార్టర్స్‌పై దాడి చేసి అధికారులపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో స్థానిక పౌరులతోపాటు 63 మంది అక్కడికక్కడే మరణించారు. 72 మంది జాడ తెలియలేదు. 33 మంది మాత్రం తప్పించుకోగలిగారు. ఈ సంఘటన యావత్ దేశాన్ని కుదిపివేసింది. సైన్యంపై పారామిలటరీ దళాలు ఇంత పెద్ద ఎత్తున కాల్పులు జరపడం బంగ్లాదేశ్ చరిత్రలోనే కనీవిని ఎరుగనిది. తమ వేతనాలు, సంక్షేమం, ఇతర సౌకర్యాలు పట్ల అసంతృప్తి, సైన్యంలో పెరిగిపోయిన అవినీతి వీరిని ఈ దుశ్చర్యకు ప్రేరేపించాయి. సంఘటన జరిగిన వెంటనే హసీనా ప్రభుత్వం రంగంలోకి దిగి అటు ఆర్మీతో, ఇటు బంగ్లాదేశ్ రైఫిల్స్ జవాన్లతో చిత్తశుద్ధితో జరిపిన చర్చలు ఫలించాయి. ఇరు పక్షాలను సామరస్యంతో, హెచ్చరికలతో దారిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రశంసలు పొందింది. తిరుగుబాటు జరిపిన మరుసటి రోజే (ఫిబ్రవరి 26) బీడీఆర్ జవాన్లు తమ బారాక్స్‌లో కి చేరుకున్నారు. తిరుగుబాటు చేసిన జవాన్లను క్షమించినప్పటికీ కమాండర్లను కాల్చి చంపిన సైనికులను చట్ట ప్రకారం శిక్షించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ మొత్తం వ్యవహారంలో బంగ్లాదేశ్ సైన్యం సంయమనం, ప్రభుత్వ దౌత్యనీతి, చాకచక్యం వెల్లడైంది. క్లిష్ట పరిస్థితులు ఏర్పడినపుడు సైన్యం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ఆదేశాలకు లోబడి ఉంటుందని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ మొయీన్ యూ అహ్మద్ ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం.

భారత్ మద్దతు:

బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచే ఎటువంటి చర్యలనైనా ఖండిస్తామని భారత్ ప్రకటించింది. ఇటువంటి సమయాల్లో తమ పూర్తి సహాయ సహకారాలను అందించడానికి సిద్ధంగా ఉంటామని భారత్ స్పష్టం చేసింది. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య కంచె లేని(స్వేచ్ఛగా ప్రవేశించగల) 4,096 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ప్రాంతం ఉంది. అందువల్ల బంగ్లాదేశ్‌లో ఏర్పడే అస్థిర పరిస్థితులు భారత్‌పై వెంటనే ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఈ స్థితి రాకుండా చూసే బాధ్యత ఇరు దేశాలపై ఉంది. సరిహద్దులను కాపాడే బంగ్లాదేశ్ రైఫిల్స్ దళం తిరుగుబాటు చేయడం, సైన్యాన్ని ధిక్కరించడం తమ దేశ భద్రత దృష్ట్యా చాలా తీవ్రమైన విషయంగా భారత్ పరిగణిస్తోంది. ఇటువంటి ఘర్షణలను తీవ్రవాదులు తమకు అనుకూలంగా మలుచుకుని భారత్‌లోకి ప్రవేశించే ప్రమాదం ఉందని రక్షణ రంగ విశ్లేషకులు ఆందోళన వ్య క్తం చేస్తున్నారు.

పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ, టెర్రరిస్టు గ్రూపులు లష్కర్-ఈ-తోయిబా, హర్కత్-ఉల్-జిహాద్-ఈ-ఇస్లామీలు బంగ్లాదేశ్‌లో స్థావరాలు ఏర్పరుచుకుని భారత్ వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నాయని రక్షణరంగ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇటువంటి చర్యలను కఠినంగా అణచివేయాలని భారత్ బంగ్లాదేశ్‌ను కోరింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ తమ దేశంలో పనిచేస్తున్న 12 మిలిటెంటు స్థావరాలను గుర్తించింది. వారి కార్యకలా పాలను నిరంతరం గమనిస్తోంది. ఈ గ్రూపులకు మద్దతు ఇచ్చేవారిని, నిధులు సమకూర్చేవారిని, వారితో సంబంధాలు కలిగిన రాజకీయ పార్టీలను, వారి అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్లు బంగ్లాదేశ్ హోంశాఖ సహాయ మంత్రి సోహెల్ తేజ్ వెల్లడించారు. వీరిని అదుపుచేసేందుకు మిత్ర దేశాలనుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలనే అనే అంశంపై మార్గదర్శకాలను కూడా తయారు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఆశిస్తున్న విధంగా రాజకీయ సుస్థిరతతో పాటు ఆర్థికప్రగతి, అన్ని రంగాల్లో బంగ్లాదేశ్‌ను అభివృద్ధి బాటన నడిపించాల్సిన బాధ్యత హసీనా ప్రభుత్వం మీద ఉంది.